అభినందనలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి చిరాకు పాశ్వాన్‌ను తెలంగాణ రాష్ట్ర లోక్ జనశక్తి పార్టీ లేబర్ సెల్ జనశక్తి మజ్దూర్ సభ అధ్యక్షుడు సురేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర జనశక్తి మద్దూరు సభ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా న్యూ ఢిల్లీలో గల చిరాగ్ పాశ్వాన్ కార్యాలయం లో ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో అన్ని రంగాల లేబర్ సమస్యల పరిష్కారం పైన దృష్టి సారించాలని కేంద్ర మంత్రి లోక్ జనశక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) లేబర్ సెల్ జాతీయ అధ్యక్షుడు రాజేష్, జాతీయ సెక్రటరీ జనరల్ విజయ్, జాతీయ ఉపాధ్యక్షుడు సుందర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సండే 'ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమరీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహింస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'రెస్పాండింగ్ వర్సెస్ రియాక్టింగ్: చూజింగ్ పీస్'అనే అంశంపై హైదరాబాద్‌లోని వానిక్స్ టెక్నాలజీస్ సీఈఓ, డాక్టర్ అశ్విన్ రానా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

మియాపూర్: ఆలయంలో చోరీ జరిగిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ రమేష్ నాయకుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మియాపూర్ నవగ్రహ ఆలయం సంతోషిమాత సముదాయం, సాయిబాబా మందిరంలో శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీని ఎత్తుకెళ్లారు. సమీపంలోని చెరువు కట్టపై వెళ్లి హుండీని బద్దలు కొట్టి అందులో ఉన్న నగదును తీసుకుని హుండీని అక్కడే వదిలేసి పారిపోయారు. ఉదయం ఆలయం తెరిచేందుకు వచ్చిన పూజారులు ఆలయ కమిటీ సభ్యులకు, మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి అక్కడ క్లూస్ టీమ్‌తో వివరాలను సేకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: భారీ వర్షాలతోప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య కాలనీ, సాయినగర్ కాలనీలలో ముంపు ప్రాంతాల్లో కలిగే సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి స్థానిక నాయకులు రఘునాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ కనీస స్వీయ రక్షణ చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ అధికారులు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి..

సాయినగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీవాసులు శుక్రవారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..హాఫీజ్‌పేట్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో పర్యటించి సమస్యలు పరిశీలిస్తానన్నారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో డబుల్ బెడ్ రూమ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదేశ్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి చంద్రయ్య, సక్రూ, నర్సింహారెడ్డి, శ్యామ్, నర్సింలు, కూర్మయ్య, మహేందర్, సాయిరాం, సూర్య ఉన్నారు.

మార్టిన్ పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘు నాయకులు

మియాపూర్: పదవ తరగతి విద్యార్థిని హన్సిక ఆత్మహత్య కేసులో సెయింట్ మార్టిన్ పాఠశాలపై, విద్యార్థి రిజ్వాన్ తల్లిదండ్రులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మధ్యాహ్నం జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో హన్సిక(15) ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆత్మహత్య చేసుకున్న తోటి విద్యార్థి రిజ్వాన్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు హన్సిక, ఆమె తండ్రి వెళ్లగా మీ అమ్మాయి కూడా మా అబ్బాయిలాగా భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవాలని అప్పుడే మా అబ్బాయి ఆత్మ శాంతిస్తుందని అంటూ ఆగ్రహించారని దీంతో తన కూతురు మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో హన్సిక తండ్రి బిజయ్ నాయక్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు పాఠశాల యాజమాన్యం, రిజ్వాన్ తల్లిదండ్రులపై బీఎన్ఎస్–108 చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాల ముందు బీఆర్ఎస్వీ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎఫ్‌బీఎస్ విద్యార్థి సంఘు నాయకులు ఆందోళన చేశారు.

అన్నిదానాల కన్న రక్తదానం ఎంతో ఉత్తమం



రక్తదానం చేస్తున్న సైనికులతో తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: అన్నిదానాల కన్న రక్తదానం ఎంతో ఉత్తమమని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్గిల్ విజయ దివాస్‌ను పురస్కరించుకొని రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో ఎఫ్‌డీడీఐ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ వీర జవాన్లను స్మరించుకొంటూ ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు సైనికులు, ఎఫ్‌డీడీఐ విద్యార్థులు, అధికార యంత్రాంగం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అందరితో రక్తదానం చేస్తామని ప్రమాణం చేయించి వీర జవాన్లను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు ముప్పిడి, జ్యోతిప్రియ ఎండీ మనోహర్ హుస్సేన్, అమిత్‌పోరి గోస్వామి, అమిత్ తివారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: వేమన కాలనీ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 4:30 గంటల వరకు కేఎస్ఆర్ (జనప్రియ టౌన్‌షిప్స్ నుంచి అయ్యప్ప స్వామి టెంపుల్), పీజేఆర్ రోడ్డు నెంబర్ 2, 4, 6, 8 ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నా రు. అలాగే ఎస్టీపీ ప్లాంట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, శంకర్ నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం..బిర్దాపూర్ గ్రామానికి చెందిన బ్రిజేష్ కుమార్(27) నగరానికి వచ్చి నాగార్జున ఎన్‌క్లేవ్ కాలనీలో స్నేహితుడు రింకు కుమార్‌తో కలిసి ఉంటూ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. బ్రిజేష్‌కు జూన్‌లో రూపతో వివాహం జరిగింది. ఆమెను సొంత గ్రామంలోనే ఉంచి బ్రిజేస్ ఒక్కడే నగరానికి వచ్చాడు. గురువారం సాయంత్రం బ్రిజేష్, రింకుకుమార్ పనులు ముగించుకుని రూమ్‌కు వచ్చారు. భోజనం తీసుకువచ్చేందుకు రింకు బయటకు వెళ్లగా బ్రిజేష్ ఒక్కడే రూమ్‌లో ఉండిపోయాడు. బ్రిజేష్ భార్య రూప రింకుకు ఫోన్ చేసి బ్రిజేష్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటానని అన్నాడని రూమ్‌కు వెళ్లమని తెలిపింది. రాత్రి 8:30 గంటలకు రింకు రూమ్‌కు వెళ్లగా తలుపులు లోపల నుంచి గడియ పెట్టి ఉన్నాయి. రింకు తలుపులు బద్దలు కొట్టి వెళ్లి చూడగా బ్రిజేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల గొడవల కారణంగానే బ్రిజేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని కలిసిన మంత్రి శ్రీధర్ బాబు



చందానగర్: చాతుర్మాస్య దీక్షలో భాగంగా చందానగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి ఇద్దరిని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మహాస్వామిని దర్శించుకొని, ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, మిరియాల రాఘవరావు, సుభాష్, సుప్రజ ప్రవీణ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో అగ్ని ప్రమాదం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని క్యామ్‌లాట్ లేఅవుట్‌లో ప్రవంతి సెరినిటీ–2లోని సెల్లార్‌లోని విద్యుత్ ప్యానల్ బోర్డులో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో అప్రమత్తమైన అపార్ట్‌మెంట్ వాసులుఅగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మంటలు ఆర్పిన మాదాపూర్ అగ్నిమాపక సిబ్బంది షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం చోసుకుందని తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోరీలు

చందానగర్ : వేర్వేరు ప్రాంతాల్లో రెండు చోరీలు జరిగిన ఘటనలు చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. సీఐ సుంకరి విజయ్ తెలిపిన ప్రకారం వివరాలు..చందానగర్ హుడా కాలనీ–2లోని షిరిడి సాయిబాబా ఆలయాన్ని 24న రాత్రి 10.30 గంటలకు మూసివేశారు. శుక్రవారం ఉదయం 4 గంటలకు స్థానికులు రాంరెడ్డి, శ్రీనివాస్‌రావు వచ్చే చూసే సరికి ఆలయం తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే వారు చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు.రెండు హుండీలను పగలగొటి సుమారు రూ.5 వేల నగదును దొంగిలించారని రాంరెడ్డి, శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

20 తులాల బంగారు ఆభరణాలు, 40వేల నగదుతో కేర్ టేకర్ పరార్..

ఫ్రెండ్స్ కాలనీలోని సాయి కీర్తి ఎస్టేట్‌లోని బ్లాక్–ఏ ఫ్లాట్ నెంబర్ 112లో నివాసముండే బుస్సా నర్సింగ్‌రావుకు ఉప్పల్‌లోని వశిష్ట హోమ్ కేర్ సర్వీసెస్ నుంచి రవి (40) కేర్ టేకర్‌గా 3 నెలల క్రితం వచ్చాడు. 24న రవి సాయంత్రం 5 గంటలకు షర్ట్ ఇస్త్రీ చేసుకొని వస్తానని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన నర్సింగ్‌రావు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గమనించాడు. చందానగర్ పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి వచ్చి జరిగిన తీరును పరిశీలించారు. తమ ఇంట్లో ఉన్న సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదును రవి దొంగిలించాడని అనుమానం ఉందని పోలీసులకు వివరించారు. ఈ మేరకు పోలీసులకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కొనసాగుతున్న ప్రణాళిక కార్యక్రమాలు



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కిషన్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కిషన్, ఆరోగ్య అధికారి నిర్మలారెడ్డి పలు వార్డుల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జియో ట్యాగింగ్ ప్రక్రియ, ప్రాపర్టీ టాక్స్, దారి పొడవునా పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను కార్మికులతో శుభ్రం చేయించారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింలు, ఏఈ కిష్టయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గచ్చిబౌలి: అనారోగ్యంతో ఓ వృద్ధురాలు బలవర్మణానికి పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాగి స్వరాజ్యం(61) భర్త రామ్మూర్తితో కలిసి కొత్తగూడలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. హాల్‌లో భర్త, బెడ్ రూమ్‌లో స్వరాజ్యం నిద్రకు ఉపక్రమించారు. శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటలకు భర్త చూడగా తలుపునకు లోపలి నుంచి గడియ వేసి ఉంది. పిలిచినా పలుకక పోవడంతో వాచ్‌మెన్ సహాయంతో తలుపు తీసి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.